


"ఏవిటి నానమ్మా..పాలల్లో పంచదార వెయ్యకుండా తెచ్చావు?" విసుగ్గా పాలగ్లాసుని టేబుల్ మీద పెడ్తూ అన్నాడు కిరణ్.

"అయ్యో మరచిపోయాను నాన్నా..ఇటివ్వు కలిపితెస్తా.." అన్నపూర్ణమ్మగ్లాసుతో వంటింటి వైపు నడిచింది.

ఏవిటో మనసు మనసులో వుండటం లేదు. చేస్తున్న పనిమీద ధ్యాస వుండడం లేదు. పాలలో పంచదార కలుపుతూ నిట్టూర్చింది. రోజూ ఇదే టైముకి ఆతనికి కూడా గోరు వెచ్చని పాలు తాగడం అలవాటు. ఇప్పుడు తాగుతున్నారో లేదో..కోడలు గుర్తుపెట్టుకుని ఇస్తుందో లేదో..

అన్నపూర్ణమ్మకి దిగులేసింది.

"నానమ్మా.." మనవరాలి పిలుపు.

ఆలోచన లోంచి తేరుకుని "వస్తున్నాతల్లీ..ఒక్క నిమిషం" అంటూనే మనవరాలికి కూడా ఇంకో గ్లాసులో కాంప్లాన్ కలిపింది. గ్లాసులు రెండూ ట్రేలో పెట్టుకుని పిల్లల గదిలోకి వచ్చింది.

"నానమ్మ పెద్ద అబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్ అయిపోయిందీ మధ్య.." గ్లాసందుకుంటూ అన్నాడు కిరణ్.

"యూఆర్ కరెక్ట్ కిరణ్. ఏమైంది నానమ్మా నీకు? ఎందుకీమధ్య అబ్సెంట్మైండెడ్గా వుంటున్నావు?" అడిగింది భావన.

అన్నపూర్ణమ్మ నవ్వింది. ఖాళీగ్లాసులు తీసుకుని మౌనంగా వెనక్కి తిరిగింది. నిజమే! ఈ మధ్య తనకి పరధ్యానం ఎక్కువైంది. ఆలోచనలన్నీ అతని గురించే...పరధ్యానం ఎందుకు అంటే ఏం చెప్పాలి. ఎలా చెప్పాలి?

నవ్వొచ్చింది..అదేక్షణంలో ఏడుపూ వచ్చింది.

• • •

"మీ అమ్మకి ఛాదస్తమా మతిమరుపా?" రాజేష్ పక్కనే సోఫాలో కూర్చుంటూ అడిగింది రమ.

"ఏం..ఏమైంది?" టి.వి లో ఏదో సీరియల్ని దీక్షగా చూస్తున్న రాజేష్ తల పక్కకు తిప్పకుండానే అడిగాడు.

"ఏమైందో వేరే నేను చెప్పడం ఎందుకు? మీరూ చూస్తున్నారుగా..కూరల్లో ఉప్పు ఎక్కువెయ్యడమో, లేదా అసలు వెయ్యకపోవడమో, పిల్లలకి భోజనాల్లో ఒకటి వడ్డించడానికి బదులు మరొకటి వడ్డించడం..మరీ ఇంత మతిమరపు చేష్టలూ..చాలా న్యూసెన్స్గా వుంది తెలుసా? పిల్లలు కూడా అదే కంప్లెంటు చేస్తున్నారు..." కోపంగా చెప్పింది రమ.

"అవును. నేనూ చూస్తున్నాను. కానీ ఎందుకో అర్థం కావడం లేదు. ఇది వరకు ఇలా వుండేది కాదు.."ఏదో ఆలోచిస్తూ అన్నాడు.

"పిల్లల పని, ఇంటి పని చెయ్యాల్సి వస్తోందని-కావాలని అలా చేస్తోందేమో.."

"అలా మాట్లాడతావేంటి, కావాలని ఎందుకు చేస్తుంది? అమ్మకి పని అలవాటే.."

"అలవాటైతే, మరీ అవకతవకలేమిటీ..?"

రాజేష్ మాట్లాడలేదు. మౌనంగా టీవీ చూస్తూ కూర్చున్నాడు.

హాల్లో కూర్చుని కొడుకు కోడలు మాట్లాడుకుంటున్న మాటలు అన్నపూర్ణమ్మకి వినిపిస్తూనే వున్నాయి.

నిజమే! తను పరధ్యానంతో పనులన్నీ అస్తవ్యస్తంగా చేస్తోంది. ఆలోచనలకి ఎంత దూరంగా వుందామని అనుకున్నా...అవి తనని చుట్టు ముడుతూనే వున్నాయి. తను ఏదో కోల్పోయిన ఫీలింగ్ తనకి తెలియకుండానే తన మనసంతా ఆక్రమించేసింది. అందుకే ఈ ఆక్రోశం!

వీళ్ళు తనని తమ అవసరాలకీ, స్వార్థానికి తెచ్చుకున్నారే తప్ప, తన మీద ప్రేమతో కాదన్న బాధ ఒక వైపు...అతను ఎలా వున్నాడో నన్న బాధ మరో వైపు...ఇక పరధ్యానం రాక ఏమవుతుంది?

ఈ ఇంట్లో ఎవరైనా తనతో ఆప్యాయంగా మాట్లాడతారా? కోడలికి సరే, కొడుక్కి కూడా తనతో మాట్లాడే తీరిక వుండదు. తీరిక టైమంతా టీవీల ముందే వుంటారు. పిల్లలు మాత్రం? వాళ్ళకి అవసరమైనపుడు 'నానమ్మా అది కావాలి- ఇది కావాలి' అని అడగడం తప్ప, ప్రేమగా దగ్గర కొచ్చి కాసేపుకబుర్లు చెప్పడం ఏనాడైనా చేసారా? ఒళ్ళో కూర్చుని ముద్దుగా 'నానమ్మా కథ చెప్పు' అని ఎప్పుడైనా అడిగారా? స్కూలు, ట్యూషన్లు, చదువులు మిగిలిన టైము టివి దగ్గర. ఇక వాళ్ళకి తనతో మాట్లాడే తీరికే లేదు. వెనకటి తరానికి, ఈ తరానికి ఎంత తేడా! కాలం మనుషుల్లో ఎంత మార్పు తీసుకువచ్చింది! ఇప్పటి పిల్లలకి నానమ్మలు, తాతయ్యలు అవసరం లేదు. టీవీ ముందు కూర్చుంటే చాలు. వాళ్ళకదే ప్రపంచం.

అన్నపూర్ణమ్మకి ఈ వాతావరణంలో ఇమడడం చాలా కష్టంగా వుంది. కుడితిలో పడ్డ ఎలకలా వుంది ఆమె పరిస్థితి. ఎంత సేపటికీ తనవూరు, తన ఇల్లు గుర్తొస్తాయి. భర్తతో హాయిగా..ప్రశాంతంగా బ్రతికిన రోజులు గుర్తొస్తాయి. రెక్కలు కట్టుకుని ఊళ్ళో..తమ ఇంట్లో వాలాలనిపిస్తుంది.

ఏమీ చేయలేని నిస్సహాయత్వం..మనసంతా శూన్యంగా వుండి..ఏ భావమూ స్పష్టంగా వ్యక్తం చేయలేని దుస్థితి. ఇక్కడ ఈ ఒంటరితనమే భరించడం కష్టంగా వుందనుకుంటే..కోడలు, పిల్లలు తన పరధ్యాన్ని ఎగతాళి చేయడం మరింత కష్టంగా వుంది. ఎన్నాళ్ళిలా?

అన్నపూర్ణమ్మకి ఒక్కసారిగా ఏడుపుముంచుకొచ్చింది.

• • •

ఆ రోజు లేచిన దగ్గరనుండీ అన్నపూర్ణమ్మకి బెంగగా, దిగులుగా అనిపించింది. భర్తని ఒక్కసారి చూడాలని..మాట్లాడాలని తహతహ ఎక్కువైంది. ఒకటా రెండా ఆరునెలలు...అతన్ని చూసి అప్పుడే ఆరునెలలైంది.

ఎలావున్నారో ఏమో! వేళకి తింటున్నారో లేదో. ఆరోగ్యం ఎలావుందో..

"అమ్మా..నేను అడిగింది పెరుగుకాదు..పులుసు" రాజేష్ అసహనంగా అన్నాడు.

అన్నపూర్ణమ్మ ఉలిక్కిపడి, ఆలోచనల నుండి తేరుకుంది.

"సరిగా వినిపించుకోక పెరుగు తెచ్చానురా..ఇదిగో



పులుసు'' అన్నపూర్ణమ్మ గబగబా పులుసుగిన్నెని కొడుక్కి అందించింది.

రమ అన్నపూర్ణమ్మ వైపు చురచురా చూసింది.

''బెండకాయ వేపుడులో కారం ఎక్కువైంది'' చురచుర చూస్తూనే అంది రమ.

''పొరబాటున కాస్త కారం ఎక్కువేసినట్టున్నాను..'' నసుగుతూ అంది అన్నపూర్ణమ్మ.

''ఏవిటమ్మా నువ్వు? నీ మతిమరుపుతో మమ్మల్నెంత ఇబ్బందిపెడుతున్నావో తెలుసా?'' భోజనం ముగించి లేస్తూ కాస్త నిష్ఠూరంగా అన్నాడు రాజేష్.

అన్నపూర్ణమ్మ ఏమీ మాట్లాడలేకపోయింది. బాధతో, అవమానంతో తలొంచుకుని మౌనంగా అక్కణ్ణుంచి వచ్చేసింది.

కొడుకూ కోడలు పిల్లలు వెళ్ళిపోయాక..తీరిగ్గా కూర్చుని ఆలోచనలో పడింది. ''తనేమిటి ఇలా తయారవుతోంది'' అనుకుంది బాధగా. ఎంత నిగ్రహించుకున్నా ఎంత స్థిమితంగా వుందామన్నా వుండనివ్వని ఏదో బెంగ..మరేదో అశాంతి! ఇక తనిలా ఈ ఇంట్లో ఎంతోకాలం వుండలేదు. ఇక్కడ నుండీ వెళ్ళిపోవాలి. తన ఇంటికి. తన బుల్లి పొదరింటికి.

ఒక నిశ్చయానికొచ్చిన అన్నపూర్ణమ్మ మనసు తేలికపడింది.

• • •

రాత్రి భోజనాలయ్యాక, హాల్లో కూర్చుని టీవీ చూస్తున్న కొడుకు దగ్గర కొచ్చింది. అన్నపూర్ణమ్మ, కాస్సేపు ఏం మాట్లాడాలో తోచనట్టు మౌనంగా కూర్చుంది. కొడుకు టీవీలో ఏదో సీరియల్ని సీరియస్‌గా చూస్తూ.. తనని పట్టించుకునేలా లేడని గ్రహించి, తనే అసలు విషయాన్ని ప్రస్థావించడానికి సిద్ధపడింది.

''నేను ఊరు వెళ్దామనుకుంటున్నానురా రాజూ..'' తన నిశ్చయాన్ని కొడుకు ముందుంచింది అన్నపూర్ణమ్మ.

''ఊరా?...ఏ ఊరు?'' రాజేష్ ఆశ్చర్యంగా తల్లి వైపు చూసాడు.

''ఊర్లో ఎవరున్నారని వెళ్తారు..?'' రమ కూడా ఆశ్చర్యపోయింది.

''ఊరంటే..అదే..మీ నాన్నగారి దగ్గరకి'' అన్నపూర్ణమ్మ కాస్త మొహమాట పడుతూనే చెప్పింది.

''నాన్నగారి దగ్గరకా? అంత దూరం ఒంటరిగా ఎలా వెళ్తావు? అయినా ఇప్పుడెందుకు ఇంత అర్జంటుగా..'' రాజేష్ కంఠంలో ఆగ్రహం తొంగి చూస్తోంది.

అది గ్రహించిన అన్నపూర్ణమ్మ ఒక్కక్షణం మాట్లాడలేకపోయింది. తన మనసులో మాటను ఎలా చెప్పాలో నిజంగా ఆమెకి తెలియలేదు. మాట తడబడింది..మనసు తల్లడిల్లింది తప్ప, గొంతు పెగల్లేదు.

''అంత అవసరం అయితే నాన్నగారే వస్తార్లే..నువ్వెందుకు వెళ్ళటం..'' తల్లి మాట్లాడకపోవడంతో తిరిగి తనే అన్నాడు రాజేష్.

## అతని కోసం



షాలిని కోసం సిగరెట్స్, మందు వగైరానే సానని అజిత్ చెప్పుకుంటూంటే, అతని క్యాబోయే వైఫ్ షాలిని ముసి ముసి నవ్వులు నవ్వుతోందిట. అట్నరే, మరి అజిత్ కోసం హీరోయిన్ వేషాలు మానుకుంటుందా షాలిని అనేదే డౌట్!

## చూసి తరించండి

ప్రేమికుడులో సన్నగా, నల్లగా వుండి, పిప్పుకామెడీ చేసే వడివేలు గుర్తున్నాడా? తాజాగా 'పొట్టాళి' చిత్రంలో ఆడవేషం వేస్తున్నాడట. అరవ పిల్లగా పరికిణీ, ఓణీ, రెండు జడలు, గాజులు, కుంకుమబొట్టు. ఇక చూస్కోండి ఆ గెటప్‌లో నేను అంటూ ఊదరగొడుతున్నాడు వడివేలు.

## కథలన్నీ అయిపోయాయి?

ఇటీవల ఓ ఆడియో కేసెట్ ఫంక్షన్‌లో రచయిత పోసాని కృష్ణమురళి ఇలా చెప్తాడు. 'ఇండియాలో కథలన్నీ అయిపోయాయి. ఈరోజుల్లో ప్రేక్షకులు తెలివిమీరిపోయారు. అవే కథల్ని తిప్పి తిప్పి మారిస్తే తెలుసుకుంటున్నారు. జాగ్రత్తగా రాయాలి. అయినా ఎంతోకష్టపడి రాసి హిట్స్ ఇస్తేనే ఉన్నాగా!' అంటూ శలవిచ్చాడు.

-రాజీ

''అది కాదురా..మీ నాన్నగారెలా వున్నారోనని..''

''ఎలా వుండటమేంటమ్మా! మరీ వింతగా మాట్లాడతావు. నాన్నగారక్కడ ఒంటరిగా ఏం లేరు కదా..ఎలా వున్నారోనని దిగులు పడ్డానికి...'' చిరాగ్గా అన్నాడు రాజేష్.

''నా ఉద్దేశం అది కాదురా..ఆయన్ని చూసి చాలా రోజులైందని..'' ఇంకెలా చెప్పాలో అర్థం కాక మధ్యలోనే ఆపింది అన్నపూర్ణమ్మ.

''ఏంటమ్మా? చాలా రోజులయ్యేది..తిన్నగా ఆర్నెల్లు కాలేదు..ఎన్నో ఏళ్ళు గడిచిపోయినట్టు మాట్లాడుతున్నావు?''

''కాదులే రాజా..ఒకసారి వెళ్ళొస్తాను..ఒక్కవారం రోజులే..'' అర్థిస్తున్నట్టుగా అడిగింది.

''పిల్లలకి ఎగ్జామ్స్ దగ్గరకొస్తున్నాయి. ఇప్పుడు నువ్వు వూరు వెళ్తానంటే ఎలా? రమకి ఆఫీసులో ఆడిటింగ్ వుంది. తను ఇంటికొచ్చేసరికి ఆలస్యమవుతుంది. పిల్లల్ని ఎవరు చూసుకుంటారు. నువ్వు లేకపోతే...'' కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు.

''ఒక్కవారం రోజులే కదా..'' పట్టుబడుతున్నట్టుగా అంది అన్నపూర్ణమ్మ.

''ఏంటమ్మా..మరీ చిన్నపిల్లలా చేస్తావు...చెబితే అర్థం చేసుకోవేం..?'' రాజేష్ తల్లి వైపు కోపంగా చూసాడు.

అంతవరకూ తల్లీకొడుకుల సంభాషణని మౌనంగా వింటూ కూర్చున్న రమ నోరు విప్పింది.

''ఆవిడకి ఇక్కడ వుండటం ఇష్టం లేదు కాబోలు. మన ఇబ్బందులు చెబుతున్నా అర్థం చేసుకోకుండా వెళ్తాను, వెళ్తాను.. అంటుంటే మీరెందుకూ ఆపడం వెళ్ళనివ్వండి''


''అబ్బే..ఇక్కడుండటం ఇష్టం లేక కాదమ్మా..మీ మామగారెలా వున్నారోనని అంతే'' కోడలికి నచ్చచెబుతున్నట్టుగా అంది.

''నాన్నగారేం అక్కడ ఒంటరిగా లేరు..నువ్విక్కడ దిగులు పడ్డానికి..ప్రస్తుతం నువ్వు వూరు వెళ్ళడం కుదరదు. తర్వాత చూద్దాం'' ఇంకా విషయం పై మాట్లాడ్డం ఇష్టం లేనట్టు రాజేష్ అక్కణ్ణుంచి లేచీ తన రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. వెనకాలే రమ కూడా లేచి లోపలి కెళ్ళిపోయింది. ఒంటరిగా మిగిలిన అన్నపూర్ణమ్మకి దుఃఖం కట్టలు తెంచుకుంది. ''వీళ్ళకి తన బాధ అర్థం కావడం లేదు'' ఏడవటం ఇష్టం లేనట్టు కళ్ళు గట్టిగా మూసుకుంటూ అనుకుంది.

ఏం చేయాలో..ఇకముందెలా బతకాలో ఆమెకి నిజంగా తెలియలేదు.

అంతా ఏవిటో నిరామయం... స్పందనా రాహిత్యం... చైతన్య విహీనం...

ఊహూ..ఇవేవీ కావు..అదో భరించలేని స్థితి!




• • •

తెల్లవారింది.

ఎప్పటిలాగే లేచి పనిలో మునిగిపోయిన అన్నపూర్ణమ్మకి తెలియదు. ఆరోజు అన్నిరోజుల్లాంటిది కాదని! వేల మైళ్ళ దూరాన్నుండి..ఒక కబురేదో రెక్కలు కట్టుకుని తన ఒళ్ళో వాలుతుందని..మనసుని వెన్నెల్లో ముంచి ఆరేస్తుందని..తెలియని ఆమె. ఎప్పటిలాగే నిర్వికారంగా, నిర్లిప్తంగా తన పని ముగించింది.

అందరూ స్కూళ్ళకీ, ఆఫీసులకి వెళ్ళిపోయాక..అన్నపూర్ణమ్మలాగే ఇల్లూ నిశ్శబ్దమైంది. ఆ నిశ్శబ్దం రసరమ్యమైన రాగాలను వినిపించేందుకు వ్యవధి మరికొన్ని ఘడియలే వుంది.

కారిడాల్‌లో కూర్చుని భాగవతం చదువుకుంటున్న అన్నపూర్ణమ్మ గేటు చప్పుడైతే తలెత్తి చూసింది. పోస్ట్ మాన్ కాబోలు లెటర్స్‌ని పోస్ట్‌బాక్స్‌లో పడేసి వెళ్తున్నాడు. వాటిని తీసుకొచ్చి, రోజులాగే టీపాయ్‌మీద పెట్టబోతూ..చిరపరిచితమైన దస్తూరి కనబడ్డంతో ఒక్కక్షణం ఆగింది. ఆ లెటర్‌ని చేతిలోకి తీసుకుని చదివింది.

''అన్నపూర్ణ..'' తనకే ఆ లెటర్. తనకి లెటరా? ఎవరూ రాసింది? ఇంకెవరు?

''ఆ అడుగుల సడి నా కెరుకే..ఆ నడకల వడి నా కెరుకే..'' అన్నట్టు ఆ దస్తూరి తన కెరుకే!

అన్నపూర్ణమ్మ మనసు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది. ఉద్వేగం భరించలేక కళ్ళ వెంట నీళ్ళొచ్చాయి. కన్నీళ్ళ మధ్యే ఉత్తరాన్ని విప్పింది. చూపులు అక్షరాల వెంట పరుగులు ప్రారంభించాయి.

''ప్రియమైన అన్నపూర్ణకి,

'ఎలా వున్నావు?' అనే ప్రశ్నతో నిన్ను పలకరించలేను. ఎందుకంటే ఎలా వున్నావో నాకు తెలుసుగనక!

ఇక నేను! నీ సహచర్యం లేకుండా నేనుండలేనని నీకూ తెలుసు. నువ్వు పక్కన లేక, జీవితం రసహీనం అయింది. అయినా జీవిస్తున్నాను.

ఎన్నాళ్ళయింది పూర్ణా నిన్ను చూసి..!

అక్కడ నీవూ..ఇక్కడ నేను మన మధ్య యోజనాల దూరం!

ఈ దూరాల భారాలని ఈ వయసులో మనం మోయలేము పూర్ణా!

అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను. మనం తిరిగి మన ఊరికి వెళ్ళిపోదాం. మనం మనంగా కేవలం అక్కడ మాత్రమే బతగ్గలం.

'ముసలివాళ్ళే కదా ఈ వయసులో ఎవరు ఎక్కడ వుంటేనేం?' అని మన పిల్లల అభిప్రాయం.

ముసలితనంలో ఒకరి ఆసరా ఒకరికి, ఎంతో అవసరమన్న నిజం వాళ్ళిప్పుడు తెలుసుకోలేరు. అయినా

వాళ్ళు మనల్ని మన మీద ప్రేమతో వాళ్ళ ఇళ్ళకి తీసు కెళ్ళలేదు. వాళ్ళ స్వార్థాలకీ, వాళ్ళ ప్రయోజనాలకీ మనల్ని వాడుకుంటున్నారు.

ఆ ఇంటినీ, పిల్లల్నీ చూసుకోడానికి చిన్నకొడుకూ, ఈ ఇంటినీ పిల్లల్ని కాపలా కాయడానికి పెద్దకొ డుకూ, మనల్ని ఆస్తుల్లాగా చెరొకరూ పంచుకు న్నారు. ఇద్దరమూ ఒకేచోట వుండి వాళ్ళకి అలాగే సహాయం చేయొచ్చు. కానీ ఇలా చెరొకచోట అంటే, ఇకపై కుదరదు. ముఖం కడిగి మడిచేస్తున్నంత తేలిగ్గా.. బంధాల్ని..జ్ఞాపకాల్ని తుడిచేసుకోగలమా? అందుకే, నీ జ్ఞాపకాలు హృదయాకాశం నిండా ముసురులా కమ్ముకున్నాయి.

నీ జ్ఞాపకాల కెరటాల్లో మనసారా మునక లేస్తూ.. ఒంటరిగా ఈ మనుషుల మధ్య..ఏమీ తోచని తనం...శూన్యంగా నవ్వే ఏకాంతం...

అయినా, ఏకాంతం వేరు..ఏకాకితనం వేరు.

ఈ ఏకాకితనాన్ని భరించడం ఇక నావల్ల కాదు పూర్ణా! దీన్ని నేను భరించలేను. ఈ భరించలేకపోవడానికి పేరు విరహం కాదు. నా కనులముందు నుండీ కాదు కదా, నీ నీడ కదలిపోతానంటేనే నేను భరించ లేను. ప్రేమకీ--పెళ్ళికీ పరమార్థం ఒకటే. ఆఖరి క్షణం వరకూ కలసి జీవించడం, శ్వాసించడం! ఈ అర్వై ఏళ్ళ ప్రస్థానంలో ఎన్ని తీపి, చేదు అనుభ వాలు..ఎప్పుడూ నీ చేయూత నందించవు. అడు గులో అడుగువేసావు..నా నీడలా!

నువ్వులేకపోతే ఎలా వుండేదో నా జీవితం..నేను హాయిగా బ్రతకడానికి నాకున్న దివ్యశక్తి నీవు..!

ప్రేమ, ఆర్ద్రత కలబోసుకున్న నీకళ్ళు నన్ను నిరంతరం వెంటాడుతూనే వున్నాయి.

ఎన్నెన్ని భావాలు ఆ కళ్ళల్లో! ఆ కళ్ళే నా కష్టాల్లో సమస్యల్లో నన్ను ఓదార్చాయి. ఆ కళ్ళే నాకు ధైర్యం చెప్పాయి. ఆ కళ్ళే నాకు ఆసరాగా నిలిచాయి. మంచు పెయింటింగ్‌లా మనసుని పలకరించాయి. అసలు ఆ కళ్ళు నా జీవితానికే ఒక ఇన్స్పిరేషన్ తెలుసా?

బహుశః ఇదే..ఒకరి కోసం ఒకళ్ళు పడే తపన...ఆరాటం, ఒకరిపై ఒకరికి తరిగిపోని ప్రేమాభిమానాలు, జీవనది లాంటి అనురాగాలు.ఒకరికోసం ఒకరం అనుకోవడమే తప్ప, ఎవరికంటే ఎవరుగొప్ప అన్న ప్రశ్నలు తలెత్తకపోవడం...తెలిసిందా..మన దాంపత్య జీవిత విజయరహస్యం?

పెళ్ళయి నలభై ఏళ్ళు దాటితే, ఇంకా ఒకరికోసం ఒకరు ఇలా తాపత్రయ పడటం ఏవిటీ అనుకోవచ్చు ఎవ్వరైనా..కానీ మన థింకింగ్ కరక్టు...ఎందుకంటే పెళ్ళైన కొత్తల్లో భార్యాభర్తల మధ్య ఆవేశమే తప్ప అవగాహన వుండదు. కొత్త అనుభూతుల తీవ్రత వాళ్ళిద్దరి మధ్య వుండే వైరుధ్యాలన్నిటినీ కప్పేస్తుంది. కళ్ళముందు లోకాన్ని అద్భుతంగా సాక్షాత్కరింపచేస్తుంది. ఎటొచ్చీ పెళ్ళై ఏళ్ళు గడిచి, పిల్లలు పుట్టి--పెద్ద వాళ్ళయిన తర్వాత కూడా అదేవిధమైన ఆలోచనలు వుండగలగడం ఓ అద్భుతమైన వరం. అందుకేనేమో అంటాడో తత్వవేత్త..'పెళ్ళి జరిగి, అందమైన అనుభవాల్ని ఆనందించే సమయంలో మేం ఆడా మగా మాత్రమే..పెళ్లైన మూడు దశాబ్దాల తర్వాత మేం నిజమైన భార్యాభర్తలమయ్యాం' అని!

జీవితపు చివరి అధ్యాయంలోకి అడుగుపెట్టాం. ఈ అధ్యాయాన్ని కూడా ఇద్దరం కలిసే పూర్తి చేద్దాం.

తిరిగి మన ఇంటికి వెళ్ళిపోదాం.

కార్తీక మాసాన సాయం సమయాన, తులసి కోట ముందు దీపం పెట్టి పూజ చేస్తున్న దృశ్యం..

ధనుర్మాసాన..తెల్లవారు ఝామున చలికి వణుకుతూ ముగ్గులేస్తున్న దృశ్యం..

గోధూళివేళ శివాలయంలో నిద్రగన్నేరు చెట్టు కింద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న దృశ్యం...

అపురూపంగా, మనోహరంగా కళ్ళముందు మెదులుతోంది.

తిరిగి ఆ దృశ్యాలను స్వంతం చేసుకుందాం!

మనుషుల అవకాశవాదాలకీ, కక్షలకీ, కార్పణ్యాలకీ అతీతంగా మనదైన ప్రపంచంలో బ్రతుకుదాం.

పిల్లలు తొలకరి వానలో తడిసినంత స్వచ్ఛంగా మనసు విప్పి కబుర్లు చెప్పుకుందాం. పసికూన తల్లిపక్కలో ఒదిగినంత సహజంగా బతుకుదాం. గోధూళి వేళ గోరంతదీపం చాలు పూర్ణా!

నేను వచ్చే సోమవారం బయల్దేరి వస్తున్నాను. నేను వచ్చాక రాజేష్‌తో మాట్లాడతాను. ఇద్దరం కలసి మనింటికి వెళ్ళిపోదాం.

రాజేష్‌కి, రమకి, పిల్లలకీ నా ఆశీస్సులు.

వుంటాను పూర్ణా!

ప్రేమానురాగాలతో

నీ

శివరామ్''

ఉత్తరం చదవడం ముగించిన అన్నపూర్ణమ్మ మనసు పురి విప్పిన నెమలే అయింది. తనివి తీరనట్టు పదే పదే ఉత్తరాన్ని చదువుకుంది. ఇన్నాళ్ళూ ఆవరించిన నిరాశ, నిస్పృహ గాలికి చెదిరిన మబ్బుల్లా చెల్లా చెదురైపోయాయి. ఇనుమడించిన ఉత్సాహంతో లేచి.. మిగిలిన పనంతా ముగిం చింది. పిల్లలు స్కూలు నుండీ వచ్చే టైముకి టిఫిన్ చేసి రెడిగా వుంచింది. ఏ పనిలోనూ పరధ్యానం లేదు, పరాకు లేదు. నీరసం, నిరుత్సాహం అంతకంటే లేవు... ఉల్లాసం ఉత్సాహం తప్ప.

గోధూళివేళ గోరంత దీపం వెలిగేందుకు కాలం సవాయత్తమవు తోంది!

★

## నిండిపోయింది

''మీపొలంలోని చెరువులో గుర్రపుడెక్కవేసి పరిశోధన మొదలెట్టానంటున్నావు. నీ పరిశోధన ఎంతవరకొచ్చింది?''

''పరిశోధనా వ్యాసం ఒకపేజీ కూడా వ్రాయకుండానే గుర్రపుడెక్కతో మా చెరువంతా నిండిపోయింది!''

## తెల్సిపోయింది

''సాహసంతో తనకోసం గోడ దూకమంటే ధైర్యంగా దూకేశానంటున్నావు. మరైతే నీ ప్రియురాలు నిన్నెందుకు తిరస్కరించినట్లు?''

''నేను సర్కస్ కంపెనీలో ఉద్యోగినని తెల్సిపోయిందట మరి!''

## ఫ్రీ

''అస్తమానూ పవర్‌కట్టవుతుంటే అర్జంటుగా మీ ఆవిడ మరో ఫానుకొందంటున్నావేంటి?''

''ఫానుకొంటే 'విసనకర్ర' ఫ్రీ అటమరి!''

- తమ్మిశెట్టి భుజంగరావు (పాలకొల్లు)

## కథకి మొదలు

ఓపాప అమ్మని కథ చెప్పమంది. అమ్మ కథ చెప్పటం మొదలుపెట్టింది.

''ప్రతికథా అనగా అనగాతో.. మొదలవుతుందామ్మా!'' అని అమాయకంగా అడిగింది పాప.

''లేదమ్మా- కొన్ని కథలు- ఆఫీసులో పని ఎక్కువగావుంది, రాత్రికి లేటుగా వస్తా- అని మీనాన్న లాంటి కథానాయకులు చెప్పటంతో మొదలవుతాయి!'' అంది ఆ అమ్మ కసిగా పళ్ళు నూరుతూ.

- తటవర్తి రామచంద్రరావు (న్యూఢిల్లీ)

